క్లుప్తంగా

ముగిసిన స్ఫటిక లింగ దర్శనం



అన్నవరప్పాడులో స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తున్న అఘోరీ మాత

పెరవలి: అన్నవరప్పాడు ఉమా విశ్వేశ్వర స్వామివారి ఆలయం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన స్ఫటిక లింగం దర్శనం మూడో రోజైన ఆదివారంతో ముగిసింది. ఆదివారం అఘోరీ మాత వచ్చి లింగానికి స్వయంగా అభిషేకం నిర్వహించారు. ఆదివారం కావడంతో పిల్లలతో పాటు వేలాది మంది విచ్చేసి స్ఫటిక లింగ దర్శనం చేసుకున్నారు. జాతీయ రహదారిపై భక్తుల క్యూలైన్ సుమారు కిలోమీటరు మేర ఏర్పడింది.

నాగారమ్మ గుడిలో జ్యోతిర్లింగార్చన



బ్రాహ్మణగూడెం నాగారమ్మ ఆలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

చాగల్లు: కార్తిక మాసం సందర్భంగా బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో ఆదివారం లక్ష సహస్ర నామ దీపారాధన, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. చాగల్లు రాజరాజేశ్వరి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. చాగల్లులో రామాలయం వద్ద దీపారాధన, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా బాలబాలికల జట్లు

దేవరపల్లి: సెపక్ తక్రా జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో హోరాహోరీగా జరిగినట్టు శనివారం పీఈటీ ఓరుగంటి నాగరాజు తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో కర్నూల్ జిల్లా నందికొట్కూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బాలికల విభాగంలో బి.దుర్గా మధురశ్రీ , కె.స్రవంతి (ఇద్దరూ చిన్నాయగూడెం), ఎం.లాస్య, కె. సుభాషిణి, ఎం.తేజశ్రీ , టి. ప్రశాంతి (నలుగురూ రామన్నపాలెం), కె.వర్షిణి , కె. జాహ్నవి(ఇద్దరూ దేవరపల్లి) ఎంపికయ్యారు. బాలుర విభాగంలో జి.సతీష్, ఎం.సతీష్, కె.అభిలాష్ (ముగ్గురూ దొమ్మేరు), వి. ప్రవీణ్, ఎ. వివేక్ (ఇద్దరూ దేవరపల్లి), వై. ఆంథోని, ఎం.అఖిల్ (రామన్నపాలెం), జి. ఉమాస్వామి రాజేష్(చిన్నాయగూడెం) ఎంపికై నట్టు ఆయన తెలిపారు.

తేమ పేరుతో ధాన్యం రైతులకు అన్యాయం

దేవరపల్లి: తేమ పేరుతో ధాన్యం రైతులను మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని రైతు సంఘం జిల్లా నాయకుడు ఉండవల్లి కృష్ణారావు ఆరోపించారు. శనివారం మండలంలోని పల్లంట్లలో ఆరబోసిన ధాన్యం రాసులను రైతులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1725 మద్దతు ధరకు కొనుగోలు చేయవలసి ఉండగా, తేమశాతాన్ని బూచిగా చూపించి రూ.1420కు కొనుగోలు చేస్తున్నారన్నారు. పెట్టుబడి పెరిగిందని, దిగుబడి ఎకరాకు 30 బస్తాలకు మించి రావడం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలో రూ.900 ప్రభుత్వం బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తోందని, మన రాష్ట్ర ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆచంట సుభాష్ చంద్ర బోస్, సీలా అప్పారావు, చెల్లించి శ్రీనివాసరావు, కాళ్ల సత్యనారాయణ, కర్రి కోటిరెడ్డి, కర్రి నాగిరెడ్డి, ముంగర రామకృష్ణారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోగులకు 'మానవత' ఆర్థిక సాయం

గోపాలపురం: గొంతు క్యాన్సర్, థైరాయిడ్ వ్యాధులతో బాధపడుతున్న మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన పత్తిపాటి సత్యవతి, మల్లిపూడి దుర్గారావు అనే వారికి ఆదివారం మానవత సంస్థ మండల శాఖ సభ్యులు రూ.11 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ సంస్థ మండలశాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, వడ్లమూడి రమేష్, గడ జోగేంద్రప్రసాద్, కె.నాగరాజు మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సాగు దండగే మరి..

- పెట్టుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ
- డ్రాగన్ ఫ్రూట్స్ సాగుపై రైతుల అనాసక్తి
- అమెరికన్ బ్యూటీ రకానికి గిరాకీ



యాదవోలులో సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోట



మార్కెట్లో అమ్ముతున్న డ్రాగన్ ఫ్రూట్స్

దేవరపల్లి: పోషక విలువలున్న డ్రాగన్ ఫ్రూట్స్ సాగు గిట్టుబాటు కావడం లేదు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు చూస్తున్నారు. కరోనా అనంతరం డ్రైఫ్రూట్స్‌తో పాటు డ్రాగన్ ఫ్రూట్స్‌కు మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. రైతులు కూడా ఈ పంట సాగుపై ఆసక్తి చూపారు. జిల్లాలోని పలు మండలాల్లో రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో తోట వేసి సాగు చేపట్టారు. దేవరపల్లి మండలం యాదవోలు, గోపాలపురం మండలం పెద్దాపురం, నల్లజర్ల మండలం నబీపేట గ్రామాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంట వేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి రాయితీ ఇచ్చి ప్రభుత్వం వరైతులను ప్రోత్సహించింది. మొక్క వేసిన రెండో ఏడాది నుంచి పంట దిగుబడి వస్తోంది. దాదాపు 20 ఏళ్లపాటు దిగుబడి వస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

ఎకరాకు రూ.8 లక్షల ఖర్చు

మొక్క నాటి, ఏడాది పాటు పెంచడానికి ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చవుతుంది. సిమెంట్ స్తంభాలు, ప్లేట్లకు ఖర్చు ఎక్కువ అవుతుంది. మొదటి రెండేళ్లు దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. మూడో ఏడాది నుంచి దిగుబడి బాగుంటుంది. మొదటి రెండేళ్లు ఎకరాకు 4 టన్నుల దిగుబడి వస్తోంది. 10వ సంవత్సరం నుంచి ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సీజన్‌లో డ్రాగన్ ఫ్రూట్స్ టన్ను ధర రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకూ పలుకుతుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకూ పంట సీజన్ ఉంటుంది. నాలుగు దశల్లో పంట దిగుబడి వస్తోంది.

20 ఎకరాల్లో పంట సాగు

జిల్లా వ్యాప్తంగా 20 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగవుతోంది. దిగుబడులు తగ్గడం, చీడపీడలు వ్యాపించడం వల్ల ఉత్పత్తి తగ్గినట్టు రైతులు తెలిపారు. ఈ ఏడాది అధిక వర్షాలకు పంటకు వైరస్ సోకి కాయలు కుళ్లిపోయినట్టు వివరించారు. రైతు వద్ద కిలో పండ్ల రేటు రూ.70 నుంచి 80 ఉండగా, మార్కెట్లో రూ.180 నుంచి రూ.200 వరకూ అమ్ముతున్నారు. సుగర్ వ్యాధి నియంత్రణకు డ్రాగన్ ఫ్రూట్స్ పనిచేస్తాయని వైద్య నిపుణులు చెప్పడంతో ఆ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అయితే ధర అందుబాటులో లేకపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కిలోకు సైజును బట్టి నాలుగు నుంచి ఐదు పండ్లు వస్తున్నాయి.

అమెరికన్ బ్యూటీ ఫ్రూట్స్ సాగు

డ్రాగన్ ఫ్రూట్స్‌లో దాదాపు 150 రకాలు ఉండగా, ఎక్కువగా అమెరికన్ బ్యూటీ రకాన్ని సాగు చేస్తున్నారు. అమెరికన్ బ్యూటీ ఫ్రూట్ గులాబీ రంగులో రుచికరంగా ఉంటుంది. దీంతో వినియోగదారులు ఈ రకం ఫ్రూట్స్ కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారని రైతులు తెలిపారు. ప్రస్తుతం పంట సీజన్ ముగిసింది. ఇప్పుడు తెలుపు రంగు డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి వస్తోందని, ఇది మార్కెట్లో సరిగా అమ్ముడు పోవడం లేదని రైతులు తెలిపారు.

గిట్టుబాటు కావడం లేదు



డ్రాగన్ ఫ్రూట్స్ సాగు ఎక్కువ పెట్టుబడితో కూడుకున్న పంట. పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తక్కువ. ఎకరాకు మొదటి ఏడాది రూ.8 లక్షలు ఖర్చయ్యింది. రెండో ఏడాది నుంచి దిగుబడి అందుకుంది. ఎకరాకు రెండు టన్నులు వచ్చింది. అయితే ఖర్చుకు ఆదాయానికి సంబంధం లేదు. పంట గిట్టుబాటు కాదు. నేను మూడేళ్ల క్రితం 1.50 ఎకరాల్లో పంట వేశాను. ఏటా ఎకరాకు రూ.1.50 లక్షల పెట్టుబడి అవుతోంది. ఈ ఏడాది అధిక వర్షాలకు కాయలు కుళ్లిపోయి మచ్చలు వచ్చాయి. మచ్చలు వస్తే పండు పనిచేయదు. దీనివల్ల నష్టం వచ్చింది. వైరస్ సోకడం వల్ల కొమ్మలు ఎండిపోతున్నాయి. రైతుకు వచ్చేది కిలోకు రూ.70 కాగా వ్యాపారులకు రూ.200 వస్తోంది. పంట గిట్టుబాటు కాకపోవడంతో సాగుకు రైతులు ముందుకు రావడం లేదు.

– కోలా రవికిరణ్, రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

తక్కువ విస్తీర్ణంలో సాగు



తక్కువ విస్తీర్ణంలో రైతులు డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగు చేస్తున్నారు. జిల్లాలో 20 ఎకరాల్లో సాగవుతోంది. పంట గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. సాగు పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పండించిన పంటకు మార్కెట్ సదుపాయం ఉండాలి. మొక్క వేసిన రెండో ఏడాది నుంచి 20 ఏళ్ల వరకూ పంట దిగుబడి వస్తోంది. క్రమంగా ఈ పండ్ల వినియోగం పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెంచడానికి కృషి చేస్తున్నాం.

– బి. సుజాతకుమారి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, రాజమహేంద్రవరం

పీఎంపీలకు వైద్య అవగాహన సదస్సులు



పీఎంపీ అసోసియేషన్ దేవరపల్లి మండల నూతన కార్యవర్గం

దేవరపల్లి: గ్రామీణులకు వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీలకు మండలాల వారీగా వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ది పీఎంపీ అసోసియేషన ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల రిటైర్ఢ్ ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం పీఎంపీలకు నిర్వహించిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సుకు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సుకు మండల శాఖ అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తన ప్రసంగంలో ప్రతి సభ్యుడూ డిసెంబర్ నాటికి సభ్యత్వాలను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అసోసియేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అసోసియేషన్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా ఆకుల నాగేశ్వరరావు (బందపురం), ప్రధాన కార్యదర్శిగా దాసరి సత్యభాస్కర్ (కృష్ణంపాలెం), కోశాధికారిగా చింతలపాటి ప్రసాదరాజు (గౌరీపట్నం), ఉపాధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకట్రావు (దేవరపల్లి), సహాయ కార్యదర్శిగా మండలపు బాల సుబ్రహ్మణ్యం (యర్నగూడెం), గౌరవాధ్యక్షుడిగా చాపల కామరాజు(గొల్లగూడెం), సభ్యు లుగా ఎం. శ్రీనివాసరావు, కె. రాణి, పి. వెంకటసుకుమార్, ఎం.అప్పారావు, వి. చంద్రరావు, ఎస్వీ సత్యనారాయణ జీఆర్ ప్రసాద్ ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సమావేశం

కోడ్ కారణంగా చర్చకు రాని సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. ఆదివారం సాయంత్రం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సమావేశంలో ఎటువంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ జరగలేదు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. యాదవోలులో త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, దీనికి అయ్యే ఖర్చు పంచాయతీ ద్వారా చెల్లిస్తామని సర్పంచ్ సున్నం వరప్రసాద్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో మండలంలో 18 పనులు మంజూరయ్యాయని, పంచాయతీల తీర్మానాలు ఇవ్వకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని పంచాయతీ రాజ్ ఏఈ వినోద్ తెలిపారు. 4.30 గంటలకు ప్రారంభమైన సమావేశం 5 గంటలకు ముగిసింది. ఎన్నికల కోడ్ కారణంగా సమావేశంలో ఎటువంటి అంశాలను చర్చించడం లేదని, సభను ముగిస్తున్నట్టు ఎంపీపీ దుర్గారావు ప్రకటించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, కార్యాలయం సూపరింటెండెంట్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో ధైర్యం, సాహసాలు

నల్లజర్ల: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో ధైర్యం, సాహసాలు అలవడతాయని ఎంఈఓ ఎం.భగవతి అన్నారు. వారం రోజులుగా నల్లజర్ల ఏకేఆర్జీ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ ఆదివారం పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ జీవితంలో ప్రతి వ్యక్తీ గెలవాలంటే ధైర్యం ముఖ్యమన్నారు. ధనం కంటే ధైర్యం గొప్పదన్నారు. ఓటమిని వదులుకోవాలన్నారు. క్రమశిక్షణ, నైతికత దేశభక్తిని అలవరచుకోవాలన్నారు. శిక్షణలో విద్యార్థులు ఏయే అంశాలు నేర్చుకున్నారనే విషయాలను క్యాడెట్లను ఆమె అడిగి తెలుసుకున్నారు. పచ్చదనం- పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు తదితర సామాజిక అంశాలను ఎంఈఓ ఎన్‌సీసీ క్యాడెట్లకు వివరించారు. ఏకేఆర్జీ సంస్థల చైర్మన్ చావాగోఖుల్, కరస్పాండెంట్ వడ్లమూడి రామారావు, ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, నల్లజర్ల సాయికృష్ణ, ఎన్‌సీసీ పీడీ వల్లీ, కల్నల్ అమిత్‌పాండే, క్యాంప్ ట్రైనర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ ట్రైనర్ పులి వెందర్ సింగ్, క్యాంప్ సూపరింటెండెంట్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

స్పందించిన మంత్రి దుర్గేష్



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలని ఆదేశిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: మండలంలోని మునిపల్లి ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరు పిల్లలు. వారు నలుగురూ ద్విచక్ర వాహనంపై మునిపల్లి నుంచి పందలపర్రు వెళుతున్నారు. ఇంతలో మునిపల్లి నుంచి నిడదవోలు వస్తున్న గుర్తు తెలియని కారు వారి వాహనాన్ని ఢీ కొట్టింది. కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో పందలపర్రుకు చెందిన నాయుడు సూర్యచంద్రం, నాయుడు గంగాభవాని, నాయుడు అమ్మాజీ, నాయుడు హరి కార్తీక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో పాల్గొని అదే మార్గంలో వస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రోడ్డు ప్రమాదాన్ని చూసి కారు లోంచి దిగి క్షతగాత్రుల వద్దకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. 108 వాహనానికి ఫోన్ చేయించి క్షతగాత్రులను నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. ముందుగా తీవ్ర గాయాలైన మహిళ గంగా భవాని, చిన్నారులు నాయుడు అమ్మాజీ, నాయుడు హరికార్తీక్‌లను తన ఎస్కాట్ వాహనంలో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిడదవోలు రూరల్ ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం



కొవ్వూరులో గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరు నుంచి నీటిని తీసుకెళ్లి పరమశివుడికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు యర్నగూడెంలోని ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తానేటి వనిత అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పార్టీ దేవరపల్లి మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరవుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

120 దేశాల కరెన్సీ నోట్ల ప్రదర్శన



ముక్కామల శాఖా గ్రంథాలయంలో 120 దేశాల కరెన్సీ, నాణేల ప్రదర్శన

పెరవలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ముక్కామల శాఖా గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచంలోని 120 దేశాల నాణేలు, కరెన్సీ, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కోనసీమ జిల్లా వాడపల్లి గ్రామానికి చెందిన అల్లు రామకృష్ణ గత 20 ఏళ్లుగా వివిధ దేశాల నాణేలను, కరెన్సీని, పోస్టల్ స్టాంప్‌లను సేకరించి ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలో రష్యాకు చెందిన 10, 50 కోట్ల విలువైన నోట్లను చూసిన పాఠకులు ఆనందించారు. అంతే గాకుండ వెండి, రాగి, బంగారు నాణేలను కూడా ప్రదర్శనలో ఉంచడంతో వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, కోపెల్లి పట్టాభిరామ్, కవి కొండల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కడియాల సాయి రామారావు, సలాది సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రీ మెచ్యూరిటీ జననాలను తగ్గించాలి



ఇవాంజలిన్

నల్లజర్ల: ప్రీ మెచ్యూరిటీ (నెలలు నిండక ముందే పుట్టే) శిశు జననాలను తగ్గించాలని ఆమెన్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఇవాంజలిన్ అన్నారు. ' నెలలు నిండకుండా పుడుతున్న పిల్లల సంఖ్య తగ్గిదాం- శిశు మరణాలు నివారిద్దాం' అంటూ దూబచర్లలో గ్రామస్తులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టే పిల్లలు పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. మారుతున్న జీవన స్థితి వైరుధ్యాల వల్ల ఏటా నెలలు నిండకుండా జన్మించే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. వారికి ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యలు ఒక్కోసారి ప్రాణాంతకం అవుతాయన్నారు. ఇటువంటి దురదృష్టకర పరిస్థితులు రాకుండా, గర్భం దాల్చిన నాటి నుంచి మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ తమ సంస్థ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోషకాహార లోపం, రక్తహీనత, బాల్య వివాహాల వంటి వాటి వల్ల ఇటువంటి పరిస్థితులు సంభవిస్తున్నాయన్నారు.

బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ సంఘాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ

కొవ్వూరు: స్థానిక సంస్కృత కళాశాల (ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠం)లో ఆదివారం బ్రాహ్మణ కార్తిక వన సమారాధన నిర్వహించారు. పట్టణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్తిక దామోదరుడికి పూజలు నిర్వహించారు. దోర్బల ప్రభాకరశర్మ, పి.సుబ్బారావు, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, డీఆర్ఎస్ఎన్ శాస్త్రి, ఇనగంటి ఉమారామారావు, కలిగొట్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వనాల్లో కార్తిక సమారాధనలు

- సందడి చేసిన పిల్లలు, యువత
- పలు రకాల పోటీల నిర్వహణ



నిడదవోలు వన సమారాధనలో మహిళల మ్యూజికల్ చైర్స్ పోటీ



ఊనగట్ల వన సమారాధనలో ఉసిరి చెట్టుకు పూజలు



తీపర్రు వన సమారాధనలో నృత్యాలు చేస్తున్న యువతులు



ఉండ్రాజవరం మండలం పాలంగి వన సమారాధనలో ఆర్యవైశ్యులు

నిడదవోలు: స్థానిక పంగిడి రోడ్డులోని పటిక ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం శ్రీ కృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. మహిళలు, యువత, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. సంఘం ఆధ్వర్యంలో మంత్రి కందుల దుర్గేష్‌ను, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, బూరుగుపల్లి శేషారావులను సత్కరించి, శ్రీకృష్ణుడి చిత్ర పటాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు యాదవ్, రాష్ట్ర యాదవ సంఘ ఉపాధ్యక్షుడు ఉక్కునూరి గోపాలకృష్ణ యాదవ్, సంఘ అధ్యక్షుడు గాలి బంగారయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ...

మండలంలోని సమిశ్రగూడెం ఆర్యవైశ్య సంఘం గార్డెన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడులను సంఘం తరపున ఘనంగా సత్కరించారు. సంఘాధ్యక్షుడు పచ్చిపులుసు వీరభద్రరావు, పచ్చిపులుసు ఆదినారాయణ, గ్రంధి బాలాజీ, పూసరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చాగల్లు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఊనగట్ల గ్రామ శివార్లలోని పొలాల్లో ఆదివారం కార్తిక వన సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి గ్రామస్తులు కుటుంబ సమేతంగా హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు. మండలంలోని బ్రాహ్మణగూడెం, దారవరం, కలవలపల్లి, మార్కొండపాడు, ఎస్. ముప్పవరం గ్రామాల్లో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు నిర్వహించారు.

పెరవలి: తణుకు ఏరియా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తీపర్రు వద్ద కార్తిక వన సమారాధన జరిగింది. ఈ అన్న సమారాధనలో 30 రకాల పిండివంటలతో వడ్డించారు. పిల్లల కోసం వివిధ రకాలు ఆటపాటల పోటీలు ఏర్పాటు చేశారు. సినీ గేయాలకు అనుగుణంగా యువతులు చేసిన నృత్యాలు అలరించాయి.

ఉండ్రాజవరం: మండలంలో మామిడి తోటలు, దేవాలయ ప్రాంగణాలలో ఆదివారం కార్తిక వన సమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు కింద పూజలు చేశారు. పాలంగి గ్రామంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆర్యవైశ్యులు సందడి చేశారు. కుటుంబ సమేతంగా పాల్గొని వన సమారాధనలో ఆహ్లాదంగా గడిపారు. పలు వన సమారాధనలలో రైతులకు పాలక్యాన్లు, మొక్కలు, భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.